అకాల వర్షం.. తడిసిన ధాన్యం



మూసాపేట వద్ద గాలివానకు నేలవాలిన వరి పంట



జానంపేట వద్ద తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



చక్రాపూర్ స్టేజీ వద్ద సర్వీస్ రోడ్డుపై తడిసిన ధాన్యం

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లో బుధవారం రాత్రి అకాల వర్షం కురిసింది. మూసాపేట మండలంలోని జానంపేట, తాళ్లగడ్డ, కొమిరెడ్డిపల్లి, అడ్డాకుల మండలంలోని శాఖాపూర్, కందూర్, పొన్నకల్‌లో వరి పంటలకు నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరి పంట గాలివానకు నేలవాలింది. అదేవిధంగా పంట నూర్పిళ్లు చేసి రోడ్లు, పొలాల్లో నిల్వ చేసిన వరి ధాన్యం తడిసిపోయింది. ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్త పడినా నష్టం తప్పలేదు. నిల్వ చేసిన చోటే ధాన్యం తడిసి పోవడంతో గురువారం ఉదయం కూలీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని ఆరబోయించారు. దీనివల్ల రైతులపై అదనంగా కూలీల ఖర్చు మీదపడుతోంది. రెండు మండలాల్లో అకాల వర్షం రైతులకు కష్టాన్ని మిగిల్చింది.

లక్ష మెజార్టీనే అభివృద్ధికి సోపానం



జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- భారీ జనసందోహం మధ్య మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్
- సర్వమత ప్రార్థనల అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్‌ఎస్ గెలవాల్సిన అవసరం ఉందని, లక్ష ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమని మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ అసెంబ్లీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ వేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయం నుంచి వేలాది మందితో తరలివచ్చారు. మంత్రి మొదట తమ నివాసంలో వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రుల సమాధుల వద్ద ఆశీర్వాదం తీసుకుని, నేరుగా ఎంబీ చర్చిలో పాస్టర్ల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత షాసాబ్ గుట్ట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం నేరుగా న్యూ టౌన్ లో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం చేరుకున్నారు. అక్కడి నుంచి తెలంగాణచౌరస్తా వరకు జనంతో నిండిపోయింది. దారి పొడవునా జనసందోహం నడుమ ప్రజలకు అభివాదం చేస్తూ న్యూ టౌన్ చౌరస్తా, అంబేద్కర్ కూడలి మీదుగా తెలంగాణచౌరస్తా చేరుకున్నారు. విజయశంఖం ఊదిన అన ంతరం ప్రసంగించారు. అనంతరం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి వెంట మాజీ మంత్రి చంద్రశేఖర్, సయ్యద్ ఇబ్రహీం, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ఎండీ హాది ఉన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా..

రెండు పర్యాయాలు మహబూబ్‌నగర్ ప్రజలు తనను ఆదరించి గెలిపించి ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవ చేసేందుకు అవకాశం ఇచ్చారని, ఇప్పుడు లక్ష ఓట్ల మెజారిటీతో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వలసలకు, పేదరికానికి చిరునామాగా ఉండిన మహబూబ్‌నగర్‌ను ఈ పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారం బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘనతగా పేర్కొన్నారు.

క్లుప్తంగా

దళితుల సంక్షేమాన్ని విస్మరించారు

స్టేషన్ మహబూబ్‌నగర్: దళితుల సంక్షేమాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో దళిత లోకాన్ని మరిచిన కేసీఆర్ దళిత ద్రోహిగా మిగిలారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని విమర్శించారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

నవాబుపేట: మండలంలోని కారుకొండ జెడ్పీ పాఠశాల విద్యార్థులకు కెనరాబ్యాంకు మేనేజర్ రాంబాబు ఆర్థికసాయం అందించారు. గురువారం విద్యానిధి పథకంలో భాగంగా 8 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున అందించారు. హెచ్‌ఎం దశరథ్‌నాయక్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే సముచిత న్యాయం



మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం లభిస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో 11న నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని కోరారు. గురువారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా తమ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటస్వామి, బాలయ్య, బాలరాజు, రాములు, ఖాదరయ్య, శ్రీరాములు, కేశవులు పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



కోయిల్‌కొండ: మండల కేంద్రంలో గురువారం ఏపీఎం విజయకుమారి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండించిన వరిని దళారులను నమ్మి ఎక్కడపడితే అక్కడ విక్రయించరాదని ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కేశవులు, భద్రునాయక్,భేఈఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులోని జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన విజయమోహన్‌రెడ్డి భార్యతో కలిసి కారులో కర్నూల్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొమిరెడ్డిపల్లి దాటిన తర్వాత మలుపు వద్ద కారు అదుపుతప్పి డివైడర్ మీదుగా హైదరాబాద్ వెళ్లే పక్క రోడ్డు మీదకు దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళ్తున్న లారీ కారుకు తగలడంతో కారు మళ్లీ డివైడర్ మీదకు వచ్చి ఆగిపోయింది. అందులో ఉన్న విజయమోహన్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్‌అండ్‌టీ అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి అక్కడే ప్రథమ చికిత్స చేశారు. తర్వాత కారును అక్కడే వదిలేసి వారిద్దరు టోల్‌గేట్ వద్ద బస్సులో కర్నూల్‌కు వెళ్లిపోయారు.

జాతీయ రహదారిపై..

జడ్చర్ల టౌన్: మండలంలోని బూరెడ్డిపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. దాసరిపల్లికి చెందిన అంజిరెడ్డి, బాలన్నలు ద్విచక్రవాహనంపై భూత్పూర్ నుంచి జడ్చర్లకు వస్తుండగా గుర్తుతెలియని వాహ నం వెనుక నుంచి ఢీకొట్టింది. గాయపడిన ఇద్దరిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తిరుపతిలో గద్వాల చంద్రశేఖరరావు గానకచేరి

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుపతిలోని పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో జిల్లా కేంద్రానికి చెందిన సంగీత విద్వాంసుడు గద్వాల చంద్రశేఖరరావు కచేరి చేయనున్నారు. ఈ మేరకు ఆయనకు టీటీడీ దాససాహిత్యప్రాజెక్ట్ నుంచి ఆహ్వానం అందింది. తిరుచనూర్‌లో నిర్వహించే అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు గద్వాల చంద్రశేఖరరావు సంకీర్తన గానం నిర్వహించనున్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తిరుపతిలో151 సార్లు గానం చేసినట్లు పేర్కొన్నారు. శ్రీవారి సన్నిధిలో గానం చేయడానికి అవకాశం వస్తుండడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

దేవరకద్రలో బీఆర్‌ఎస్ భారీ ర్యాలీ



దేవరకద్రలో ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గం నుంచి మూడో సారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా తరలి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీగా వచ్చారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డు నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు కార్యకర్తల నినాదాలతో బాజాభజంత్రీలతో ర్యాలీ కొనసాగింది. అనంతరం బలపరిచే వారితో కలిసి ఆర్‌ఓ కార్యాలయంలోకి వెళ్లి రెండు నామినేషన్ సెట్లను ఆర్‌ఓ నటరాజ్‌కు అందజేశారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్ ఉన్నారు.

మరో సారి ఆశీర్వదించండి..

నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేయని విధంగా పనులు చేశామని, పనిచేసే వారిని ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

భవిష్యత్ మరింత అభివృద్ధి చేసుకుందాం



గులాబీమయంగా మారిన సిగ్నల్‌గడ్డ

జడ్చర్ల టౌన్: నియోజకవర్గం, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తో కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారి మోహన్‌రావుకు నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు పర్యాయాలు అధికారం ఇచ్చినందుకే ఎంతో చేశామని, మరోసారి అవకాశం ఇచ్చి భవిష్యత్ మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. 55ఏళ్లపాటు కాంగ్రెస్ పాలించినప్పటికీ కనీసం తాగునీటిని అందించలేకపోయిందని, కరెంట్ సక్రమంగా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయలేని వారు ఇపుడు మళ్లీ ఓట్లు అడగటానికి వచ్చారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో, పట్టణంలో ప్రచారానికి పోయినపుడు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గ్రామాలు, తండాలు, పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. సంక్షేమ పథకాల విషయానికి వస్తే సీఎం కేసీఆర్ మేనిఫెస్టోను అన్ని వర్గాలకోసం రూపొందించారన్నారు.

ఒకే రోజు నాలుగు నామినేషన్లు..

దేవరకద్ర: నియోజకవర్గం నుంచి ఒకే రోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రెండు సెట్లను దాఖలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కతలయ్య విద్యార్థుల రాజకీయ అనుబంధ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. భూత్పూర్ మండలానికి చెందిన ఎల్లప్ప ప్రజాఏక్తా పార్టీ నుంచి నామినేషన్ వేశారు. జన శంఖారావం పార్టీ నుంచి మండల కేంద్రానికి చెందిన బండ మధుసూదన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన్ ఘట్టం ప్రారంభం కాగా బుధవారం వరకు నలుగురు నామినేషన్‌లు వేశారు. ఇప్పటి వరకు మొత్తం 8 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

స్టేషన్ మహబూబ్‌నగర్/హన్వాడ: జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్ట, జగదాంబకాలనీ, టీచర్స్ కాలనీతోపాటు పలు ప్రాంతాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. హన్వాడ మండలంలోని లింగన్నపల్లి, ముని మోక్షం, హన్వాడ తదితర గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

'పేట' ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కోయిల్‌కొండ: నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గురువారం ఉదయం మండలంలోని శేరివెంకటాపూర్‌లో ఆంజనేయస్వామి దేవాలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు నిర్వహించి నామినేషన్ వేసేందుకు నారాయణపేటకు వెళ్లారు. అంతకుముందు ఆంజనేయస్వామి దేవాలయంలో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ప్రజలే అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓబ్లాయిపల్లిలో ఉర్సు ప్రారంభం



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ఓబ్లాయిపల్లిలో మహిబూబ్ సాహెబ్ దర్గా ఉర్సు గురువారం రాత్రి ప్రారంభమైంది. సాహెబ్ గంధాన్ని భక్తులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉర్సు సందర్భంగా దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

కురుమూర్తికి తరలివస్తున్న వ్యాపారులు



కురుమూర్తి జాతర మైదానంలో ఏర్పడ్డ హోటళ్లు



జాతరమైదానంలో ఏర్పాటు చేస్తున్న రంగుల రాట్నాలు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14న ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలతోపాటు జాతర నెలరోజులపాటు వైభవంగా కొనసాగుతుంది. ఉత్సవాలను పురస్కరంచుకుని జాతర మైదానంలో వివిధ రకాల వ్యాపారాలు కొనసాగించేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు తరలివస్తున్నారు. మైదానంలో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే రంగుల రాట్నాలు, సర్కస్, హోటళ్లు, ఆట వస్తువులు, మిఠాయి తదితర దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉద్దాల మహోత్సవం నాటికి జాతర మైదానంలో దుకాణ సముదాయాల ఏర్పాట్లు పూర్తి కానున్నాయి.

సాగుకు సబ్సిడీలు లేనట్లేనా?


- సకాలంలో మంజూరుకాని సబ్సిడీ స్ప్రింక్లర్లు



రాయపల్లి శివారులో వేరుశనగ సాగుచేస్తున్న వేరుశనగ పంట (ఫైల్)

రాజాపూర్: ప్రస్తుతం కూలీల కొరతతో పాటు పెట్టుబడి ఖర్చులు అధికమవ్వడంతో అన్నదాతలు ప్రత్యామ్నాయ పద్ధతులను ఆలోచిస్తున్నారు. గతంలో రైతులకు బిందు సేద్యం కోసం కావాల్సిన డ్రిప్ సిస్టం, స్ప్రింక్లర్లు, ట్రాక్టర్‌లతోపాటు వాటికి కావాల్సిన పరికరాలు ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీలకు, చిన్న, సన్నకారు రైతులకు 50 నుంచి 90 శాతం వరకు సబ్సిడీ ఇచ్చి రైతులను అన్ని విధాలుగా ఆదుకుని ప్రోత్సహించారు. ప్రస్తుతం రైతుబంధు ఇవ్వడంతో వీటన్నింటిని ఎత్తేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈసీజన్‌లో రైతులు ఎక్కువగా పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలను బిందు సేద్యం, తుంపర సేద్యంతో సాగు చేస్తుంటారు. ప్రస్తుతం 50శాతం సబ్సిడీపై స్ప్రింక్లర్లు తతదితర పరికరాలను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.


పైపులు ప్రైవేట్‌లో తెచ్చుకున్నా



గతేడాది నుంచి స్ప్రింక్లర్ పైపుల కోసం వ్యవసాయశాఖ అధికారులను అడుగుతూనే ఉన్నా. ఇప్పుడు సబ్సిడీపై పైపులు వస్తలేవని చెప్పారు. కనీసం టార్పాలిన్లు అయినా ఉన్నాయి అంటే అవి కూడా లేవంటున్నారు. ఇప్పుడు పల్లీ సీజన్ వచ్చింది. రూ.వేలు ఖర్చుచేసి ఐదుగురు కలిసి స్ప్రింక్లర్ పైపులు తెచ్చుకున్నాం. సబ్సిడీపై ఇస్తే రైతులకు ఆసరాగా ఉండేది.

– దూళ్ల ఎర్రన్న, రైతు, రాయపల్లి

ఆయిల్‌పాంకే ఇస్తరంట..



కొన్నేళ్లుగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ఆశించిన మేరకు దిగుబడి రావడం లేదు. ఉన్న పొలంలో మామిడి తోటసాగు చేద్దామనుకున్నా. ప్రభుత్వం నుంచి డ్రిప్‌కు సబ్సిడీ వస్తదని అనుకుంటే డ్రిప్ కేవలం ఆయిల్‌పాం తోటలకు ఇస్తున్నారు. రైతులకు అవసరమున్న యాంత్రీకరణ వస్తువులను సబ్సిడీపై ఇస్తే బాగుంటుంది.

– వెంకట్‌రెడ్డి, రైతు, కల్లేపల్లి

రావడం లేదు..

2018 నుంచి స్ప్రింక్లర్లు రావడం లేదు. డ్రిప్ హార్టికల్చర్ వారు చూస్తున్నారు. టార్పాలిన్లు, స్ప్రింక్లర్లు రైతులు అడుగుతున్నారు. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తూనే ఉన్నాం.

– నరేందర్, ఏఓ, రాజాపూర్

చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలి



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, ఈఎంఆర్‌ఎస్ ట్రైబల్ వెల్ఫేర్ మాజీ క్రీడల అధికారి రమేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో 2వ జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ కొనసాగుతుంది. గురువారం పాఠశాలల క్రీడాజట్లను రమేష్‌కుమార్ పరిచయం చేసుకుని మాట్లాడారు. పట్టుదలతో ఆడితే క్రీడల్లో విజయం సాధించవచ్చని అన్నారు. నిరంతరం క్రీడలను సాధన చేస్తే నైపుణ్యంగల క్రీడాకారుడిగా ఎదుగుతారని సూచించారు. నాల్గవ రోజు మ్యాచుల్లో గెలాక్సీ హైస్కూల్‌జట్టు 7 వికెట్ల తేడాతో లుంబిని స్కూల్ జట్టుపై, షాసాబ్‌గుట్ట పాఠశాల జట్టు 4 పరుగుల తేడాతో గీతశ్రీ స్కూల్ జట్టుపై, సెయింట్ ఆగ్నేస్ జట్టు 17 పరుగుల తేడాతో ఢిల్లీ ఒలింపియాడ్ జట్టుపై, ఉదయ మెమోరియల్ స్కూల్ జట్టు 15 పరుగుల తేడాతో క్రీస్తు జ్యోతి విద్యాలయం జట్టుపై, లిటిల్ స్కాలర్ పాఠశాల జట్టు 7 వికెట్ల తేడాతో అపెక్స్ స్కూల్ జట్టుపై, న్యూటౌన్ స్కూల్ జట్టు ఒక పరుగు తేడాతో జ్ఞానభారతి స్కూల్ జట్టుపై, సెయింట్ ఆగ్నేస్ జట్టు 55 పరుగుల తేడాతో కృష్ణవేణి స్కూల్ జట్టుపై గెలుపొందాయి. కార్యక్రమంలో పీడీ బాల్‌రాజు, పీఈటీలు వినోద్ కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న రామయ్య చెరువు



అలుగు పారుతున్న రామయ్య చెరువు

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో ఉన్న రామయ్య చెరువు అలుగు పారుతుంది. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా ఖిల్లాఘనపురం మీదుగా కాల్వ ద్వారా వచ్చే కృష్ణా జలాలు కొన్నాళ్ల నుంచి చెరువులోకి వస్తున్నాయి. కేఎల్‌ఐ కాల్వ ద్వారా వచ్చే నీళ్లు జగ్గాయపల్లి నుంచి కొత్తగా తవ్విన కాల్వలో చౌట చెరువుకు వస్తున్నాయి. ఆ చెరువు నిండి దిగువన ఉన్న శనిగె చెరువుకు రావడంతో అది కూడా నిండి దాని దిగువన ఉన్న రామయ్య చెరువులోకి చేరుతున్నాయి. ఈక్రమంలో గురువారం చెరువు నిండి అలుగు పారింది. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వెలిబుచ్చుతున్నారు. వర్షాకాలం దాటిన తర్వాత చెరువు నిండి అలుగు పారుతుండటంతో వేసవికాలంలో రామయ్య చెరువు కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరందే అవకాశం తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కమల

బాలానగర్: మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా గురువారం కేవలం కోరం సభ్యులు, కొన్ని శాఖల అధికారులు, కొందరు కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఎంపీపీ కమల ఆయా శాఖల పనితీరుపై సమీక్ష చేసి, ప్రజలకు అవసరమైన తాగునీరు, ఆరోగ్య, విద్యా, విద్యుత్‌శాఖలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు చురుకుగా పనిచేయాలని ఆదేశించారు.

పీయూ రీసెర్చ్ స్కాలర్‌కు డాక్టరేట్ ప్రదానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ రీసెర్చ్ స్కాలర్ కె.సంధ్య డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు ప్రొఫెసర్ గిరిజ పర్యవేక్షణలో ఆమె 'ఎన్విరాన్‌మెంటల్లీ బినైన్ బయోసింథసిస్ ఆఫ్ పెల్లాడియం నానో పార్టికల్స్ అండ్ ఇట్స్ యూజ్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ రిమిడేషన్ అండ్ బయోలాజికల్ అప్లియేషన్స్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు గాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ మాట్లాడుతూ యూనివర్సిటీలో మెరుగైన రీసెర్చ్ అవకాశాలు ఉండడంతో స్కాలర్స్ సకాలంలో పరిశోధనలు పూర్తి చేసి పరిశోధన పత్రాలు సమర్పించడం గొప్ప విషయం అన్నారు.

ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం : పీవైఎల్

నారాయణపేట రూరల్: పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలంటే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాశీనాథ్ కోరారు. పట్టణంలోని భగత్‌సింగ్ భవన్‌లో గురువారం జరిగిన పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా గాలికొదిలేశాయని.. కార్పొరేట్ శక్తులకు ఎర్ర తివాచి పరుస్తున్నాయని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం సరైంది కాదని.. పూర్తిగా కాషాయీకరణ వైపు అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. విద్యార్థులు లేరనే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ప్రభుత్వ పాఠశాలలను మూసి వేస్తోందని, ఉపాధ్యాయ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు తల్లడిల్లుతున్నారని వాపోయారు. కనీసం వాలంటీర్లను కూడా నియమించడం లేదని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి పీడీఎస్‌యూతో కలిసి పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సాయికుమార్, కార్యదర్శి అజయ్, బాలు, గౌస్, శ్రీహరి, వెంకటేష్, అనిత, రాధిక, అనుష, మనీష తదితరులు పాల్గొన్నారు.

